# తనతోటే లోకం

సీతారామయ్యకి అరవై ఏళ్లు నిండాయి: కలవాడు కావటంచేత షష్టిపూర్తి మహోత్సవం మహోత్సాహంతో, వైభవంగా జరుపుకుంటున్నాడు. ఈ ఉత్సవం జరుపుకోటానికి ఈయనకి గల ప్రత్యేకత ఏమీ లేకపోయినా, మనదేశంలో అరవై ఏళ్లు బతకటమే ఓ విశేషం కావటంవల్లా. ఏదో సాకుతో నాలుగు రోజులు బంధుమిత్రులతో ఉల్లాసంగా కాలం గడపవచ్చుననే భావంవల్లా సీతారామయ్య యీ ఉత్సవం తలపెట్టటం సంభవించింది. ఈ సందర్భంలో ఆయన్ని పొగడుతూ చాలామంది కవులూ, తదితర స్నేహితులూ స్తోత్రపాఠాలు చదివారు. వాళ్ళందరికీ తలో శాలువా లభించింది.

అరవై ఏళ్ళ నిండు జీవితంలో సీతారామయ్య చాలా విషయాలు తెలుసుకున్నాడనే చెప్పాలి. చివర చివర ఆయన పురాణగ్రంథాలూ, ఉపనిషత్తులూ అవీ, క్షుణ్ణంగా చదివి ఈ ప్రపంచం ఒట్టి మిథ్య అనీ, ఆత్మ ఒక్కటే చావులేనిదనీ గ్రహించి తదనుగుణంగా ప్రవర్తించాడు. స్కూల్ఫైనల్ ప్యాస్ కాగానే కొడుకుని చదువు మాన్పించి, సంస్కృతం, వేదాలూ చదివించాడు. సీతారామయ్యకి రానురాను ఇంగ్లీషు చదువులమీద ఏహ్యం కలిగింది. అది చదువుకుని కుర్రాళ్ళు వృథాగా చెడిపోతున్నారనీ, ఇల్లూ, వొళ్ళూ గుల్ల చేసుకుని ఆ భాష చదివినా దానివల్ల కలిగే పుణ్యమూ, పురుషార్థమూ పూజ్యమేననీ ఆయనకి గట్టి నమ్మకం కలిగింది. కాలేజీ కుర్రాళ్ళని చూస్తే ఆయనకి ఓ విధమైన జాలి, కోపం కూడా కలుగుతాయి. ఇంగ్లీషు పద్ధతిలో ఆ వేషధారణని చూస్తే ఆయనకి అరికాలిమంట నెత్తికెక్కుతుంది. స్కూల్ఫైనల్ ప్యాసయిన ఆయనకొడుకు సూటు కుట్టించుకోవాలని ఉబలాటపడితే, అతనిని చీవాట్లు పెట్టి ఒక రోజంతా హిందువుల ఔన్నత్యాన్నీ, పూర్వీకుల సంప్రదాయాన్నీ బోధించాడు. మిగతా కుర్రాళ్లందరికీ ఆరోజునించీ స్కూల్ చదువు మానిపించి తెలుగూ, సంస్కృతమూ చెప్పించాడు. వాళ్ళచేత ప్రతినిత్యం భగవద్గీత పారాయణం చేయించేవాడు. తమ ఈడు కుర్రాళ్లు స్కూలుకు వెళ్ళి ఎన్నో సంగతులు నేర్చుకుని వాటిని గురించి మాట్లాడుకుంటుంటే ఆప్యాయంతో వింటూ ఉబికే ఉత్సాహాన్ని తండ్రిభయంతో లోలోపలే అణుచుకుంటుండేవాళ్లు సీతారామయ్య కుర్రాళ్లు. ఆ ఈడు

కుర్రాళ్ళతో తన కొడుకుల్ని పోల్చుకుని ఆయన ఎంతో గర్విస్తాడు. కాని వాళ్ల అప్పుడప్పుడు సణుక్కోటం విని కాస్త కించపడుతూండేవాడు.

సినిమాలు, నాటకాలు నైతిక పతనానికి దారి తీస్తాయని సీతారామయ్యకి ఎంచేతో గట్టి అభిప్రాయం ఏర్పడ్డది. సాధారణంగా తన కుర్రాళ్ళని సినిమాకిగాని, నాటకానికిగాని వెళ్ళనియ్యడు. తరుచు సినిమాలకి వెళ్ళటంవల్ల కలిగే అనర్థాలు వాళ్లకి నచ్చచెప్పాడు. ఆయన పెద్దకొడుకు ఓసారి ఆయనకి చెప్పకుండా స్కూల్ నాటకంలో వేషం వేశాడు. మర్నాడు స్కూలుకు సెలవు పెట్టించి అతనికి వేషాలు వెయ్యటంలో కల నష్టాలని ఏకరువు పెట్టాడు. చెడిపోవటానికి నటుడికి ఎక్కువ అవకాశా లుంటాయనీ, అసలు నటుడనేవాడు చెడిపోకుండా ఉండడనీ సోదాహరణంగా బోధించాడు. ఆ కుర్రాడు అప్పటికి ఏమీ పల్లెత్తుమాట అనకపోయినా తర్వాత నటనలో గల సహజ అభిలాషని తన తండ్రి బలవంతాన అణచటానికి ప్రయత్నించాడనీ, తన భావి కళాజీవితానికి ప్రతిబంధక మయాడనీ వాళ్ళతో, వీళ్ళతో అన్నట్టు చూచాయగా విని సీతారామయ్య కాస్త విచారించాడు. తన మేలుకోసం చేసిన బోధ మరోవిధంగా అర్థం చేసుకోటంలోగల మనస్తత్వానికి జాలిపడ్డాడు. చివరికి ఆ కుర్రాడు ఇంట్లో చెప్ప కుండా ఓ నాటకం కంపెనీవాళ్ళ జట్టులో చేరిపోయాడు. సీతారామయ్య సంగతి తెలుసుకుని పెదవి చప్పరించాడు. తర్వాత ఆ కుర్రాడు చాలా నాటకాల్లో వేసి కీర్తి సంపాదించుకున్నాడు. కాని సీతారామయ్య ఏమాత్రం సంతోషించలేకపోయాడు.

భారతదేశంలో జనసంఖ్య ఉండాలిసిన దానికంటే చాలా ఎక్కువగా ఉందని సీతారామయ్య ఒప్పుకుంటాడు. ఇలాగే జనసంఖ్య వృద్ధిపొందుతూంటే ముందు ముందు చాలామందికి తినడానికి తిండికూడా దొరకదని ఆయన నమ్మాడు. ఆర్థికంగా దేశం బాగుపడాలంటే జనసంఖ్య అమితంగా వృద్ధిపొందుతూ ఉండటాన్ని అరికట్టడం ఒక్కటే అనుసరించతగిన మార్గమనీ, ఉత్పత్తి ఎంత పెంచినా జనసంఖ్య దానికి కొన్ని రెట్లు అమితంగా వృద్ధిపొందుతూంటే ప్రయోజనం శూన్యంకదా అని ఆయన వాదం. జనసంఖ్య అభివృద్ధిని అరికట్టటానికి ఆయన సూచించిన విధానాలు రెండు. మొదటిది—ప్రతి యువకుడూ ఆలస్యంగా, అంటే కనీసం ముప్ఫయి ఏళ్ల వొచ్చేదాకా వివాహ మాడకూడదు. శాస్త్రాల్లో కూడా స్త్రీకి వివాహయుక్తమైన వయస్సు నిర్ణ యించబడ్డదిగాని పురుషుడికి అలాంటి షరతులు గాని నిర్బంధాలు గాని ఏమీ లేవు; పురుషుడు ఎంతవరకు మనో వాక్కాయ కర్మలచేత నిగ్రహం ఆచరించగలడో అంత

వరకూ వివాహం ఆడటం తలపెట్టకపోవటంలో తప్పేమీ లేదు అని సహేతుకంగా శాస్త్ర ప్రమాణాలతో వాదిస్తాడు. దురదృష్టవశాత్తూ మన దేశంలో కాలేజీల్లో చేరీ, ఇంగ్లీషు నేర్చుకునీ, ఇతర దురభ్యాసాలవల్లా యువకులు నిగ్రహం అలవర్చుకోలేక త్వరగా పెళ్లిచేసుకుని దేశాన్ని దౌర్భాగ్యస్థితికి తీసుకువస్తున్నారని ఆయన ఆక్రోశం. ఇహ రెండో పద్ధతి- బ్రహ్మచర్యావలంబన. వివాహం చేసుకోటం సంతానం కోసమే గాని కామవాంఛ తీర్చుకోటానికి కాదు: ఒకరిద్దరు సంతానం కలగగానే బ్రహ్మచర్య నిష్ఠ అవలంబించటం ప్రతివాడి విధ్యుక్తధర్మం. అలాకాక మనదేశంలో ప్రతి కుటుంబీకుడికి కుప్పలసంతానం ఉంటోంది. దీనివల్ల కలిగే చిక్కులు కుటుంబానికే కాక దేశానికి కూడా చికాకు కలిగిస్తాయి. ప్రతి కుటుంబీకుడూ బ్రహ్మచర్యం ఆచరించటం అంచేత తప్పనిసరి అని సీతారామయ్య గంటలకొద్దీ ఉపన్యసిస్తాడు. నిజానికి, ఆయనకీ ఉపాయం తట్టగానే బ్రహ్మచర్యదీక్ష పుచ్చుకున్నాడు.

సీతారామయ్యకి పదవులకోసం అటమటించేవాళ్ళని చూస్తే మంట. "పదవుల్లో ఏముంది ? ఎందుకు వీళ్ళకింత తాపత్రయం ?" అంటాడు. మునిసిపల్ ఎన్నికలకి జరిగే సంరంభం చూసి నవ్వుకుంటాడు. చైర్మన్ కావటానికి నానాపాట్లూ పడేవాళ్ళని చూసి జాలిపడతాడు. "ఏముంది చైర్మన్‌గిరిలో ? ఎవరు చైర్మనయితేనేం? మూడు రోజులు ప్రపంచంలో బతికి చివరి కెటుపోతామో కూడా తెలియని మనుష్యులకి ఇన్ని వాంఛ లెందుకు ?" అని ఆశ్చర్యపోతాడు.

ఇదీ స్థూలంగా సీతారామయ్య పరిచయం. తనని ఆశీర్వదిస్తూ స్నేహితులైన కవులూ, ఇతరులూ వ్రాసిన పద్యాలూ, తన జీవితసంగ్రహం షష్టి పూర్తి ఉత్సవానికి చిహ్నంగా ఓ పుస్తకంలో అచ్చువేయించాడు. ఆ పుస్తకంలో సీతారామయ్య వివిధ దశలలో తీయించుకున్న ఫోటోలుకూడా ఉన్నాయి. ఆ ఫోటోల్ని గురించి చెబితే సీతారామయ్య జీవితంలో ముఖ్యమైన ఘట్టాల్ని చెప్పినట్టే.

మొదటిది ; సీతారామయ్య కుటుంబం. ఇందులో సీతారామయ్య, ఆయన భార్య, ఆయన ఎనమండుగురు కొడుకులూ, కూతుళ్లు ఉన్నారు.

రెండోది : సీతారామయ్య కాలేజీలో ప్రవేశించినప్పటి ఫోటో. మనిషి దర్జాగా, ట్వీడ్ సూటులో దొరలా ఉన్నాడు.

మూడోది : సీతారామయ్య బి.ఏ. పట్టం పొందినప్పటి ఫోటో. కాన్వొకేషన్ డ్రెస్‌లో ఉన్నాడు.

నాలుగోది : సీతారామయ్య, ఆయన భార్యా వివాహంనాటి ఫోటో. సీతారామయ్యకి అప్పుడు సుమారు ఇరవై ఏళ్ల వయస్సు.

అయిదోది ; సీతారామయ్య కృష్ణపాత్ర వేసినప్పటిది.

ఆరోది ; సీతారామయ్య క్రాపు తీయించి పిలకపెట్టినప్పటి ఫోటో. సుమారు 36 ఏళ్ల వయస్సు.

ఏడోది : సీతారామయ్య బ్రహ్మచర్యదీక్ష అవలంబించినప్పటి ఫోటో. 40 ఏళ్ల వయస్సు.

ఎనిమిదోది ; సీతారామయ్య మునిసిపల్ చైర్మన్‌గా ఎన్నుకోబడినప్పటి ఫోటో.

తొమ్మిదోది ; సీతారామయ్య షష్టిపూర్తినాడు తీసిన ఫోటో.

[తెలుగు స్వతంత్ర 23-12-'49]